1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | డిసెంబర్ 31, 2023 | www.navatelangana.com

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు

ధర్మారం(బి) విద్యార్థినులు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న నీరజరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ధర్మారం(బి) విద్యార్థినులు ఎంపికయ్యారని, చత్తీస్‌ఘడ్‌లో జనవరి 3నుండి 6 వరకు జరగబోయే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజ రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 16 నుండి 18 వరకు వరంగల్ జిల్లా తొర్రూరులో నిర్వహించిన 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ అండర్-17 పోటీల్లో ధర్మారం (బి) విద్యార్థినులు నక్షత్ర, శరణ్య మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయినట్టు పేర్కొన్నారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ సంగీత, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కిషన్, పిఈటీ హౌస్ టీచర్స్ విద్యార్థులను అభినందించారు.

మూడు లక్షలు దాటిన దరఖాస్తులు

- మూడో రోజు 1,43,951 వినతులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి



దరఖాస్తులు నింపి ఇస్తున్న ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వరదబట్టు వేణురాజ్

ప్రజాపాలన గ్యారెంటీ పథకాల అమలు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణ శనివారం కొనసాగింది. మూడో రోజు శనివారం పెద్దఎత్తున దరఖా స్తులు వచ్చాయి. దీంతో దరఖాస్తుల సంఖ్య 3,04,095కు చేరింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం ఒక్క రోజే ఏకంగా 92,457 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లాలో 1,96,833 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఇక కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మున్సిపాల్టీలతో పాటు గ్రామాలకు కలిపి 51,494 దరఖాస్తులు రాగా, మూడు రోజులకు గాను 1,07,262 దరఖాస్తులు వచ్చాయి.

ప్రజా సమస్యలపై ప్రజాపాలనలో

దరఖాస్తులు చేయించాలి

- వాటి పరిష్కారం అయ్యే విధంగా చొరవ చూపాలి
- పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- వైఫల్యాలు కప్పిపుచ్చుకోడానికి రామాలయంతో పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సమస్యలపై ప్రజా పాలనలో దరఖాస్తులను పెట్టించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి హాజరై పాలడుగు భాస్కర్ మాట్లాడారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 6 గ్యారంటీల అమలు కోసం ప్రజలతో దరఖాస్తులను స్వీకరించటానికి ప్రజా పాలన కార్యక్రమం ద్వారా అధికారులను పట్టణాలు గ్రామాల్లో కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. దశాబ్ద కాలంగా ప్రజలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు సమస్యల పైన అనేకమార్లు గత ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరిష్కారం కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న దరఖాస్తులను అర్హుల అందరి చేత పెట్టించి వాటిని అమలు జరపటానికి పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్



హాజరైన సీపీఐ(ఎం) ముఖ్య నాయకులు, కార్యకర్తలు

అదేవిధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం అయోధ్యలో రామాలయం పేరుతో జనవరి 20వ తేదీ నాడు విస్తృతంగా ప్రజల్లో చర్చను జరిపి రాజకీయ ప్రయోజనాలను పొందాలని చూస్తున్నారని గత దశాబ్ద కాలంగా ఉపాధి పెంచటంలో కానీ రైతులు మహిళల సమస్యల పరిష్కారంలో కానీ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి రామాలయం నిర్మాణం అంశాన్ని ముందుకు తీసుకొచ్చారని ఈ పేరుతో మతం రెచ్చగొట్టి తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆయన విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, నన్నే సబ్, సూరి, జె.గంగాధర్‌తో పాటు వివిధ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌లో వసూళ్లపై నజర్

- ఆపరేటర్ తొలగించిన అధికారులు
- మరిన్ని కేంద్రాలు పెంచాలని స్థానికుల డిమాండ్

నవతెలంగాణ-బిచ్కుంద



సూచనలిస్తున్న అధికారులు

బిచ్కుంద మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ నమోదుకు వచ్చిన ప్రజల వద్ద నుండి 200 వందల నుండి 300 వందల వరకు ఎక్కువ డబ్బులు తీసుకొని టోకెన్‌లు ఇచ్చి డబ్బులు ఇచ్చిన వారికే ఆధార్ నమోదు చేసి పెడుతున్నారని శనివారం నవతెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బీఎస్ ఎన్ ఎల్ కామారెడ్డి డిఈ సురేందర్, బాన్సువాడ ఎస్సి రామేశ్వరచారి, జేటిఓ శ్రీకృష్ణ, తహసిల్దార్ లక్ష్మణ్ ఆపరేటర్ మాధవ్‌ను తొలగించి ఆయన స్థానంలో రఫీక్‌ను నియమించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రజలకు ఆధార్ నమోదులో ఇబ్బందులు రాకుండా బాన్సువాడ, బిచ్కుంద, మద్నూర్‌లో నూతన సెంటర్లు నియమించినట్టు తెలిపారు. అతి త్వరలో పిట్లం, జుక్కల్‌లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆధార్ సెంటర్లలో ఆపరేటర్లు ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆధార్ సెంటర్లను పెంచాలి..

అధికారులు కేవలం కంటి తు(ము)డుపు చర్యగా తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మేలు జరగది, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆధార్ సెంటర్లు, పెంచేదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం మండలానికి కేవలం ఒకేఒక ఆధార్ సెంటర్ ఉండటంతో నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. ఆధార్ సమస్యలతో ఇతర పనులు చెయ్యనియ్యకుండా ప్రతి సారి ఆధార్ కొరకు సెంటర్ల చుట్టూ తిరగడం, అలాగే పిల్లలకు ఆధార్ సమస్య ఉంటే వారు ఉండేది పాఠశాలలో అక్కడి నుండి ప్రతి సారి సదరు పాఠశాల యాజమాన్యానికి అడగటం వారు విసికించుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ఆధార్ సెంటర్లకు ప్రతిసారి తిరిగే ఇబ్బందిని తొలగించేందుకు ప్రజలు అడిగినాన్ని ముట్ట చెప్పుతూ పనులు చేయించుకుంటున్నారు. ఎవరైనా ఆధార్ గురించి తెలిసి ఎందుకిలా అని వాదిస్తే వారికీ తిప్పలు తప్పడం లేదు. అదీలేదు, ఇదిలేదు, సర్వర్ ప్రాబ్లమ్, ఫలానా వారి సంతకం తెండి, సమయంలో అయిపొయింది రేపు మాపు అని కొరివిలు పెడుతూ ప్రజలకు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యకు మూలమైన ఆధార్ సెంటర్ల కొరతను గుర్తించి, ఆధార్ సెంటర్లను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్‌లైసెన్స్‌తో మందుల తయారీ

- రూ.ఆరు లక్షల నకిలీ మందులు పట్టివేత



నకిలీ మందులు స్వాధీనం



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫుడ్ లైసెన్స్ తో ఔషధాలు తయారు చేస్తున్న నకిలీ కంపెనీ గుట్టును నిజామాబాద్ డ్రగ్స్ అధికారులు రట్టు చేశారు. ఆరు లక్షల విలువగల నకిలీ మందులను సీజ్ చేశారు. పక్క సమాచారంతో నిజామాబాద్‌లో నిల్వ చేసిన ఆ నకిలీ మందులను డ్రగ్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఔషధాల తయారీకి ఏలాంటి అనుమతి లేకున్నా హైదరాబాదు మూసాపేట్ లోని రాజీవ్‌గాంధీ నగర్‌లో రామ్ ఫార్మాసిటికల్స్ అనే కంపెనీ మందులు తయారు చేస్తోంది. ఈ నకిలి కంపెనీపై హైదరాబాద్ కు చెందిన డ్రగ్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అనుమతులు లేవని నిర్ధారించారు. అయితే అప్పటికే ఆ కంపెనీ తయారు చేసిన ఆరు లక్షల విలువైన నకిలీ మందులను రహస్యంగా నిజామాబాద్‌కు సరఫరా చేశారు. నిజామాబాద్ లోని బయోమెడిక్ ఫార్మస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కి పంపారు. ఈ తతంగం గత కొన్ని రోజులుగా జరుగుతుంది. మేడ్చల్ నుండి వచ్చిన సమాచారం ఆధారంగా శనివారం డిప్యూటీ డైరెక్టర్ సరళ ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. నర్సయ్య నిజామాబాద్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు శ్రీకాంత్, శ్రీలత నిజామాబాద్ ఆధ్వర్యంలో రూ.6 లక్షల విలువైన నకిలీ మందులు, 300-100 క్యాప్సూల్స్ పరిమాణంలో నకిలీ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బయోమెడిక్ ఫార్మ స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ప్రజల ప్రగతికే ప్రజాన్యాయపీఠాలు

- లోక్‌అదాలత్ ప్రారంభోత్సవంలో జిల్లా జడ్జి కె.సునీత
- పరిష్కారం.. అభివృద్ధికి చిహ్నం : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమాజంలో మానవ సంబంధాలే ముఖ్యమని, కక్షలు, కార్పణ్యాలు విచ్ఛిన్నానికి దారి తీస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. పౌరుల మధ్య పొరపొచ్చాలు, పగలు, ప్రతీకారాలు అనేక అనర్థాలకు దారి తీస్తాయని, ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా జీవించడం అలవర్చుకోవాలని హితవు పలికారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్.జయరాంతో కలిసి జిల్లా జడ్జి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా సమూహాలు చట్టానికి లోబడి జీవించాలని, చట్ట వ్యతిరేకమైన జీవనశైలి, చర్యలకు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తులతో వ్యవస్థ నిర్మాణం అయిందని, ఆ వ్యవస్థ కొన్ని నియమాలతో ముందుకు సాగుతోందన్నారు. వ్యవస్థ సాఫీగా సాగేందుకు చట్టాల అవసరం ఏర్పడిందని, చట్టాలను అనుకరించడ అందరి కర్తవ్యం అన్నారు. పౌరుల మధ్య దీర్ఘకాలిక శత్రుత్వాలు కొనసాగరాదనే లక్ష్యంతో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తూ, అన్ని రకాల సివిల్ దావాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్టు వివరించారు. జిల్లా పోలీసు, కార్యనిర్వాహక వర్గాల సహకారం తో సివిల్, క్రిమినల్ కేసులే కాకుండా సామాజిక బాధ్యతగా పౌరసమాజ ప్రగతికి న్యాయసేవ సంస్థ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఆమె వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, పదకొండేళ్లుగా కొనసాగుతున్న ఒక సివిల్ వివాదాన్ని న్యాయసేవ సంస్థ సహకారంతో పరిష్కరించుకుని భీంగల్ భూనష్ట పరిహార బాధితులకు రూ. 3 కోట్ల 90 లక్షల బ్యాంకు చెక్‌ను ప్రభుత్వం తరపున అందజేసి వివాదానికి ముగింపు పలికినట్లు తెలిపారు. ట్రాఫిక్ చలాన్లు వాహన దారులచే వసూలు చేయించడంలో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంటే నిజామాబాద్ జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. ఏ పరిష్కారమైన అది జిల్లా అభివృద్ధికి చిహ్నమేనని అన్నారు. సామరస్యపూర్వక పరిష్కారమే అన్ని సమస్యలను సమసిపోయేలా చేస్తుందన్నారు. భారతీయ వికాసానికి వ్యక్తుల వ్యక్తి గత బీమా పథకం ముఖ్యమని, కొన్ని రకాల ఆర్థిక సమస్యల పరిష్కారంలో బీమా ప్రీమియంలు క్రియాశీలకంగా నిలుస్తూ బాధితులకు ఊరటనిస్తున్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. కాగా, మతపరమైన కేసులు తప్ప అన్ని రకాల రాజీపడదగిన క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే విదంగా న్యాయసేవ సంస్థకు పోలీసు శాఖ తనవంతు బాధ్యతగా సహకరిస్తున్నదని అదనపు డీసీపీ జయరాం తెలిపారు.



పరిహారం చెక్కు అందజేస్తున్న జిల్లా జడ్జీ, కలెక్టర్

రూ. 3.90 కోట్ల చెక్కు అందజేత

ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ లోని భీంగల్ మండల కేంద్రంలో పేదలకు నివేశన స్థలాల కోసం సేకరించిన భూమి విషయమై భూ నిర్వాసితులైన వారికి మంజూరైన రూ. 3 కోట్ల 90 లక్షల చెక్ ను జిల్లాజడ్జి సునీత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్మూర్ ఆర్.డీ.ఓ వినోద్ లతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు జిల్లా జడ్జి ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, న్యాయాసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న

శ్రీచైతన్య విద్యాసంస్థను సీజ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, టీజీవీపీ, ఎల్ఎస్‌వో డిమాండ్



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ధనార్జనే ధ్యేయంగా అక్రమ అడ్మిషన్‌లకు పాల్పడుతూ, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య కార్పోరేట్ విద్యాసంస్థను తక్షణమే సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్‌లో కొనసాగుతున్న ఆ స్కూళ్లల్లో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్మూర్‌లో బ్రాంచిలో విద్యార్థులను చితకబాదిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, టీజీవీపీ, ఎల్ఎస్‌వో ఆధ్వర్యంలో శనివారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. పగిలిన ట్యాంక్ అంశంపై విద్యార్థులను ఒక్కక్కరిగా గదిలోకి పిలిచి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించడం అందులోని పదవ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థుల పైన చేయి చేసుకున్నారని అయినా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. రెండో శనివారం, ఆదివారాల్లో సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నారని, కావున చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్, అనిల్, కళ్యాణ్ జ్వాలా, విగ్నేష్, జీవన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఆదర్శం

- వికసిత్ భారత్ యాత్రలో ఎంపీ అరవింద్



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-ఎడపల్లి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, అర్హులు వినియోగించుకోవాలని ఎంపీ అరవింద్ సూచించారు. ఎడపల్లి మండలం లోని ఠానాకలాన్ గ్రామంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. ఎంపీ హాజరై మాట్లాడారు. ప్రధాని మోడీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, బిజెపి బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, సర్పంచ్ పాల్ద భాస్కర్ రెడ్డి, ఎడపల్లి మండల బిజెపి అధ్యక్షులు, ఇంద్రకరణ్, ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట రెండు కార్యక్రమాలు

- ఇటు ప్రజా పాలన, అటు సంకల్పయాత్ర
- గందరగోళానికి గురైన ప్రజలు



ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న చోటే సంకల్పయాత్ర రథం..

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం విధితమే. అయితే ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ కార్డు, ఉపాధి హామీ కార్డు కరెంట్ పలు రకాల జిరాక్స్‌ల కోసం తిరుగుతూ అలసిపోతున్నారు.

అంతలో మోడీ రథ యాత్ర

అంతలోనే ప్రజలు గుంపు ఉన్న చోటునే మోడీ సర్కార్ ప్రభుత్వం చేస్తున్నా సంక్షేమ పతకాల రథ యాత్ర రావడంతో అక్కడి ప్రాంగణం లొల్లిలొల్లిగా మారింది. అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి అధికారులు ఏకకాలంలో చెప్పుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

విరివిగా డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు

- ఇతరులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలకు లోబడి న్యూయర్ వేడుకలు చేసుకోవాలి
- అదనపు డీసీపీ జయరాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నిబంధనలకు లోబడి వేడుకలు నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా చేసుకోవాలని అదనపు డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీస్ జయరాం సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ప్రమాదాలకు కారకులు కావొద్దని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత ప్రాధాన కూడళ్ల వద్ద విరివిగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపట్టనున్నట్టు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. వేడుకల సందర్భంగా మత్తులో రోడ్లపై వేగంగా, ఇష్టారా జ్యంగా వాహనాలు నడు పుతూ ప్రమాదాలకు-కారకులు కావొద్దని తెలిపారు. ఆంక్షలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ కార్యక్రమములు నిర్వహించరాదు. ఫామ్ హౌస్, క్లబ్స్, గ్రేటేడ్ కమ్యూనిటిలో అనుమతి లేకుండా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించొద్దని, వాటిని కూడా పరిమితి మించకుండా సౌండ్ వాడొద్దని తెలిపారు. ప్రజలను భయాందోళనకు, ఇబ్బందులకు గురి అయ్యే విధంగా క్రాకర్స్‌ఆర్.కె స్ట్రా సౌండ్సిస్టమ్ లేదా అత్యధిక మొతాదులో గల సౌండ్ సిస్టమ్ (డి.జె) ఏర్పాట్లు నిషేధించినట్టు తెలిపారు. ఎందుకంటే కొన్ని ప్రదేశాలలో వృద్ధులు లేదా అనారోగ్యంతో బాదపడు తున్నవారికి ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న జయరాం

స్పెషల్ పార్టీలు..

అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో సాయంత్రం 6 గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టనున్నట్టు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భం గా ఫోటోగ్రాఫి వీడియో గ్రాఫీలు తీసిన తర్వాత వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి

- ప్రజాపాలన దరఖాస్తులపై కలెక్టర్ రాజీవ్ గాంధీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన సభలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సరిపడా సంఖ్యలో దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని, వాటిని సక్రమంగా నింపేలా సహకారం అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని 41వ డివిజన్ పరిధిలో గల చంద్రశేఖర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణకై ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దకు వెళ్లి, వాటిని స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. మైనారిటీ ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఉర్దూ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీరు, నీడను అందించేలా షామియానాలు, కుర్చీలు తదితర సదుపాయాలను కల్పించాలని అన్నారు. దరఖాస్తులను ఉచితంగా అందించేలా అన్ని ఏర్పాట్లు చేశామని, ఎవరు కూడా మీసేవ, జిరాక్స్ సెంటర్ల నుండి తీసుకోకూడదని కలెక్టర్ సూచించారు. ఒక కుటుంబం వారందరు ఒకే దరఖాస్తు అందిస్తే సరిపోతుందని సూచించారు. కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

దరఖాస్తులు ఇంటింటికొచ్చి ఇస్తాం

- ఫాంలు అమ్మితే కఠిన చర్యలు : మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పట్టణ ప్రజలకు ప్రజా పాలనా దరఖాస్తు ఫారంలు నిజామాబాద్ నగర పాలక సంస్థ నుండి ఇంటికి ఆర్పీల ఉచితంగానే అందజేస్తారని, లేదా సంబంధిత వార్డు కౌంటర్‌ల లో ఉచితంగానే పంపిణీ చేస్తారని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ శనివారం ప్రకటనలో తెలిపారు. అవసరమైతే కౌంటర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కావున ప్రజలు ఎవ్వరు ఇంటర్నెట్ సెంటర్లకు కానీ జిరాక్స్ సెంటర్లకు కానీ దరఖాస్తు ఫారం కోసం వెళ్లొద్దని, మీసేవ, ఇతర నెట్ సెంటర్, జిరాక్స్ సెంటర్ లలో ప్రజా పాలన దరఖాస్తులు అమ్మినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరకాస్తుతో పాటు రేషన్ కార్డ్ జిరాక్సులు లేకపోయినా కానీ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న కారు

- వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలో నిలిచిన ట్రాక్టర్‌ను అతి వేగంగా వచ్చిన కారు ఢీకొని అక్కడిక్కడే కారులోని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నందిపేట్ మండలం నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ సమీపంలో నిలిచిన ట్రాక్టర్‌ను అతి వేగంతో ఢీ కొంది. ఈప్రమాదంలో కారులోని వ్యక్తి మృతిచెందాడు. మృతుడు నందిపేట్ మండలంలోని నూత్ పల్లి గ్రామంలోని యూబిఐ బ్యాంక్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఉదుతల రాజు(40) అని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదీర్ రావు తెలిపారు.


రాజు మృతదేహం

రాంమందిర్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని రాంమందిర్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా, పిఈటీలుగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా విద్యార్థులకు బోధన చేయడం చాలా కష్టంతో కూడిన పని అని అన్నారు. విద్యార్థులకు అర్థం అయ్యేలా చెప్పాలంటే చాలా ప్రిపేర్ అయి రావాలని, చాలా కష్ట పడాల్సి వచ్చిందని తెలిపారు. రోజు విద్యా బోధన చేస్తున్న సార్ల గొప్పతనం తెలిసిందని చెప్పారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానో పాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయులు చంద్రకాంత్, మనోహర్, వినోద తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశ పరీక్షకు ధరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశానికి ప్రవేశపరీక్ష టిజిసెట్ 2024కుగాను ధరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, నిజామాబాద్ ఆర్‌సివో కె. అలివేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుచున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవటానికి అర్హులని తెలిపారు. తల్లి దండ్రుల వార్షికాదాయం పట్టణాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేల రూపాయల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అంతర్జాలం ద్వారా షష్.ంషతీవఱం.ఖష.ఱఅ లేదా ష్ట్రజూ:/స్ర్రఎవ.ఎస్ర్రస్ర.స్ర్రశీఱ.ఱఅ నమోదుచేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ, విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల ప్రాధాన్యత ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ఎంపికయిన విద్యార్థులకు ఆంగ్ల మాద్యమంలో విద్యాబోధనతో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించ బడతాయని వివరించారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం, ప్రాస్పెక్టస్‌లకోసం పైవెబ్‌సైట్‌లను సంప్రదించవచ్చని తెలిపారు. ధరఖాస్తులు సమర్పించటానికి చివరి తేది 6.1.2024 ప్రవేశపరీక్ష 11.2.2024 నాడు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రన్‌పల్లి గ్రామ ఎస్సి మాల సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఎమ్మెల్యేని సన్మానించారు. సంఘ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరి వినోద్ మాల సంగ సభ్యులు పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చేతుల మీదుగా యువజన కాంగ్రెస్ తరపున నూతన క్యాలెండర్ శనివారం ఆవిష్కరించినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి, నిజామాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీయాదవ్, రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉమ్మాజీ నరేష్ రూరల్ అన్ని మండలాల అధ్యక్షులు వెంకటేష్, మధు, రాజేందర్, శ్రీనివాస్, సూర్య నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం రాబోతున్న సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు గన్న శ్రీనివాస్ పుష్పగుచ్చము అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని బాయ్స్ పాలిటెక్నిక్ కళాశాలలో బీఎస్ రావు ఫౌండేషన్ వారు ఏర్పాటుచేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు హాజరై ప్రారంభించారు. బిఎస్ రావు వారి ఫౌండేషన్ ద్వారా అనేక స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, అందులో భాగంగానే పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ను ఉచితంగా అందజేయడం సంతోషకరమైన విషయమని వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం దాత బీఎస్ రావు, ప్రిన్సిపల్ రామ్ కుమార్, ఎ. డి. తోట రాజశేఖర్, లెక్చరర్స్ వంశీ కృష్ణ, బాలనర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ మృతిపై కేసు నమోదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్మారం బీ గ్రామానికి చెందిన జనార్దన్ ఈశ్వరి (58) మృతి పై పలు అనుమానాలు ఉన్నాయని మృతురాలి కూతురు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న జనార్దన్ ఈశ్వరి శుక్రవారం రాత్రి సమయంలో తన ఇంట్లో ఒక్కరే నిద్రించారని, శనివారం చూసేసరికి మృతి చెంది ఉందని, మృతురాలి మరణం పై తమకు అనుమానం ఉందని మృతురాలి కూతురు దొంది చందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నవతెలంగాణ-మోపాల్

ండలంలోని బోర్గం (పి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శనివారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న తరగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల పాఠశాలలన్నింటిలో బోర్గం ఉన్నత పాఠశాలకు మంచి ప్రాముఖ్యత ఉందని, అత్యధికంగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో జిల్లాలోని ఇదొకటని, ఆయన తెలిపారు. పదవ తరగతిలో కూడా విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని మొదటగా ఈ పాఠశాల నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

అర్హులకు పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి/సిరికొండ/బాల్కొండ/ఆర్మూర్/నవీపేట్/ముప్కాల్

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి లబ్ధిదారుడికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా చూడాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్‌లోఅభయ హస్తం ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల నుండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా గడీల పాలన చేసిందని, నేడు రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు నాంది పలికారన్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన ఉంటుందని, ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ టీఏస్ గోపిబాబు, వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, సర్పంచ్ నీరడి సృజన, డిచ్‌పల్లి మాజీ సర్పంచులు బూస సుదర్శన్, ఏజి.దాసు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, శాంసన్,గుడి నరేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా డిచ్‌పల్లిని దత్తత తీసుకుంటా..

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటి సారి డిచ్‌పల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు, వివిధ కుల సంఘాలు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు డిచ్ పల్లి ఖిల్లా రామాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిచ్ పల్లి గ్రామాని దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ హామీ ఇచ్చారు.

సిరికొండ:ప్రజా పాలన కార్యక్రమంలో మండలకేంద్రంలో స్వీకరిస్తున్న దరఖాస్తులను ఆర్డిఓ రాజేంద్ర కుమార్ శనివారం పరిశీలించారు. దరఖాస్తుల్లో ఏ విధంగా పూర్తిస్థాయిలో వివరాలను పొందుపరిచాలో గ్రామస్తులకు తెలియజేశారు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకునేలా సూచనలు చేశారు. తెల్ల రేషన్ కార్డుకోసం దరఖాస్తు సమర్పించాలని కోరారు. దీంతోపాటు రేషన్‌కార్డుకోసం కూడా దరఖాస్తులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి సేకరించేలా పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా సిరికొండ మండలంలో ప్రతి రోజు నాలుగు గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సర్పంచ్ తాండ , కొండాపూర్ గ్రామాల సభల్లో పాల్గొన్నామన్నారు. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.


డిచ్‌పల్లి :మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాల్కొండ:బాల్కొండ మండల పరిధిలోని బోదేపల్లి, వన్నెల్(బి) గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ అద్ప శ్రీధర్ గ్రామ ప్రజలకు అభయ హస్తం దరఖాస్తులు, పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామపంచాయతీల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా గ్రామ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జనవరి 6 తరువాత తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వినోద్, బాల్కొండ ఎస్సై కే గోపి, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ రెడ్డి, వైద్యశాఖ అధికారిని స్రవంతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆర్మూర్ :30 వ వార్డులో దరఖాస్తు ఫారంలను కాంగ్రెస్ బిసి సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకం ద్వారా ఆరు గ్యారంటీలను అమలుకు చేపడుతున్న ప్రజా పాలన దరఖాస్తు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి సంక్షోభంలో ఉన్న తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అభివృద్ధి చేసి సంక్షేమం వైపుగా నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో పాలన అధికారులు ఉదయ శ్రీ, దొండి గంగమణి, పద్మ గోపి, కాంగ్రెస్ నాయకులు పింజ అభినవ్, రాజ్ తోపారం, భగత్, సాగర్ పాల్గొన్నారు.


నవీపేట్ :దరఖాస్తుల గురించి తెలుసుకుంటున్న డీపీవో

నవీపేట్:మండలకేంద్రంలోని గ్రామపంచాయతీతో పాటు రైతు వేదికలో ఏర్పాటు చేసిన అభయహస్తం దరఖాస్తు కేంద్రాలను నిజామాబాద్ డిపిఓ జయసుధ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణపై సిబ్బందిని అడిగి పలు సూచనలిచ్చారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. తీసుకున్న దరఖాస్తులను జాగ్రత్తగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ధన్వాల్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీ ఓ రామకృష్ణ,వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్, కార్యదర్శి రవీందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు

ముప్కాల్:ఆరు గ్యారెంటీల 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణ శనివారం మండల ప్రత్యేకాధికారి ఏడీ శ్రీనివాస్ తోటి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. జనవరి 6వరకు 'అభయ హస్తం' కార్యక్రమం కొనసాగుతుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవకుండా 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున 19 కౌంటర్‌లను ఏర్పాట్లు చేశారు. రేషన్ దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌ను సైతం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీపీ సామ పద్మ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, తహసీల్దార్ వనజ రాణీ, ఎంపీడీవో దామోదర్, ఎస్ఐ భాస్కరాచారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గంగారాం, ఎంపీవో భారత్ చంద్ర, ఏవో రాజ్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రెవిన్యూ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్ వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, ఐకేపీ, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల రిమాండ్

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని ధర్మోర గ్రామంలో గత నెల 23న ఎలిటి శంకర్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులు నాందేవ్‌తో పాటు తన స్నేహితులు మాణిక్ నారాయణ షిండే, శివానంద్ గంగాధర్ కడంలు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిపై ఇప్పటికే పలు కేసులు నమోదయినట్లు తెలిపారు. మోర్తాడ్ రైల్వే స్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వీరిని పట్టుకున్నామన్నారు. వీరి నుండి 18 తులాల బంగారు ఆభరణాలు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వేల్పూర్‌లో 7, మోర్తాడ్‌లో నాలుగు, భీంగల్‌లో, ఆర్మూర్, బాల్కొండలో ఒకటి చొప్పున, జక్రాన్‌పల్లిలో-2 వీరిపై కేసులు ఉన్నట్లు చెప్పారు. ఈ ముగ్గురు కలిసి దొంగతనాలు చేసిన బంగారు ఆభరణాలను సరి సమానంగా పంచుకొని జల్సాలు చేస్తున్నారని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన భీంగల్ సిఐ వెంకటేశ్వర్లు, మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి, కానిస్టేబుళ్లు, సిసిఎస్ సిబ్బందికి రివార్డ్ వచ్చేలాగా చూస్తామని అన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు..

న్యూ ఇయర్ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్మూర్ ఎసిపి జగదీశ్ చందర్ అన్నారు. అధిక మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతోపాటు ఇతరులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపకుండా వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా న్యూ ఇయర్ సెలబ్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మహిళా సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం


ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతున్న కార్యదర్శి సిద్ధయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో శ్రీ సాయి కన్వెన్షన్ హాల్లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో శనివారం రాజరాజేశ్వరి మహిళా సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సెక్స్ వర్కర్స్ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆరోగ్యం మంచిగా ఉంటే సంపద ఉన్నట్లేనని అన్నారు. అలాగే వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే వారు ప్రభుత్వ ఆరోగ్య శాఖ ద్వారా ఉచిత ఆరోగ్య సేవలు పొందవచ్చు అని తెలియజేశారు. స్నేహ సొసైటీ మహిళ సెక్స్ వర్కర్స్‌కు ఎన్నో సేవలు అందిస్తుందని అందుకు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో నలుగురు మహిళా సెక్స్ వర్కర్లకు ప్రభుత్వం ద్వారా అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు అందిస్తున్నామని, భవిష్యత్తులో వారికి ఆరోగ్య శాఖ ద్వారా అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య మాట్లాడుతూ స్నేహ సొసైటీ నిజామాబాద్ జిల్లా స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ హెచ్ఐవి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మహిళా సెక్స్ వర్కర్ల ఆర్థిక అభివృద్ధికి వారి హక్కుల పరిరక్షణకు సిబిఓ కమ్యూనిటీ బేసిడ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో 400 మంది సెక్స్ వర్కర్స్ పాల్గొని వారి కొత్త కమిటీని ఎన్నుకున్నారు ఈ కమిటీలో అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, సహాయ కార్యదర్శి, నలుగురు కార్యవర్గ సభ్యులు ఉంటారు అని తెలిపారు. కార్యక్రమంలో డిపిఎం సుధాకర్, తాటి వీరేశం, మొహిజ్ అహ్మద్, నాగరాజు, మహిళా సెక్స్ వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిప్ప-కొండెం చెరువు ప్రాజెక్టు రీడిజైన్ రద్దు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మంచిప్ప -కొండెం చెరువు ప్రాజెక్టు రీడిజన్ రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం నాయకులు కోరారు. నిజామాబాదు ఉమ్మడి జిల్లా కమిటి సమావేశం శనివారం నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్‌లో నిర్వహించారు. ముప్పా నాగేశ్వర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పౌర హక్కుల సంఘం 50 వసంతాల సభలు ఆహ్వాన సంఘం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..? మంచిప్ప -కొండెం చెరువు ప్రాజెక్టు రీడిజైన్ రద్దు చేసి, పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం చేయాలని కోరారు. బాధితులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు.2024 మార్చి 9,10 తేదీల్లో హైదరాబాద్ లో జరిగే పౌర హక్కుల సంఘం 50 వసంతాల సభలు విజయవంతం చేయాలని కోరారు. ఎన్సిఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్దరణ చేయాలని, సర్వే నంబర్ 106లో ముబారక్ నగర్ శివారు లోని 14 ఎకరాల్లో క్రీడాప్రాంగణ ఏర్పాటు చేయాలని, సుఖ్ జిత్ స్టార్చ్ మిల్ నుండి విలువడే విషవాయువులపై, కలుషిత నీరు పూలంగ్ నది నీటిని కలుషితం చేస్తున్న దానిపై చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో కొంగర శ్రీనివాస్ రావు, వి. సంగం,భూమన్న, జెలందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులైన జోగు సంగీత-నర్సయ్యల చిన్నమ్మ జోగు భూదేవి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్, పార్టీ సీనియర్ కార్యకర్తలు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, కోప్షన్ మెంబర్ మునీరుద్దీన్, జోగు చిన్న నర్సయ్య, పెంటు గంగాధర్, పృథ్వీ వల్లబ్, నర్సింగ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

క్రీడాస్ఫూర్తితో లక్ష్య సాధన సునాయాసం

- నిజామాబాద్ ఏసీపీ యం. కిరణ్ కుమార్

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని సత్యశోధక్ హైస్కూల్లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో చదువుతో పాటు వినయం, క్రమశిక్షణ, సమయపాలనను అలవర్చుకొని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుంటే లక్ష్య సాధనను సునాయాసంగా చేరుకుంటారని నిజామాబాద్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ యం. కిరణ్ కుమార్ అన్నారు. శనివారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించిన సత్యశోధక్ స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ కిరణ్‌కుమార్, విశిష్ట అతిథిగా ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదా, గౌరవ అతిథులుగా సిరికొండ ఇన్‌స్పెక్టర్ రమేష్ హాజరయ్యారు. సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిజామాబాద్ చైర్మన్ ఆర్. నర్సయ్య అధ్యక్షతన జరిగిన సభాకార్యక్రమంలో ముఖ్య అతిథి ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు స్కౌట్స్, గైడ్స్, ఆటలు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వల్ల వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఆప్రయత్నంలో ఎప్పుడు ముందుండాలన్నారు. విద్యార్థి దశలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకొని విషయ పరిజ్ఞానంను పెంపొందించుకొని, సందేహాలను ఎప్పడికప్పుడు నివృత్తి చేసుకొని స్వీయ పరిశీలనను అలవర్చుకొని ఎంచుకున్న లక్ష్యంకోసం అహర్నిశలు శ్రమించి తల్లిదండ్రుల ఆశయాలను స్మరించుకుంటూ సాధన చేస్తే తప్పక విజేతలవుతారని తెలిపారు. ప్రాథమిక దశనుండే ప్రతి విద్యార్థి నిత్యం నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉంటే జ్ఞాన సముపార్జన వృద్ధి చెందుతుందన్నారు. చిన్నారులు చెడువ్యసనాలకు దూరం ఉండాలని వాస్తవిక స్థితిగతులను బేరీజు చేసుకుంటూ చురుకు దనంతో పరిపూర్ణంగా ఉంటేనే ఉన్నత స్థాయికి చేరిన తర్వాత మంచి పౌరులుగా ఎదుగుతారని విద్యార్థులకు కేవలం మార్కులను మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా తల్లిదండ్రులకు పరస్పరం సహకరించడం, సామాజిక అంశాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎంచుకున్న రంగంలో నిష్ణాతులయి స్థిరపడాలన్నారు. విద్యార్థుల పేరెడ్, సాంస్కృతిక కార్యక్రమాలు క్రమశిక్షణ, పాఠశాల వాతావరణంను ప్రత్యేకంగా అబ్బుర పరిచిందని తెలిపారు. వివిధ వినూత్న క్రీడలను విద్యార్థులకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. సత్యశోధక్ స్పోర్ట్స్ మీట్ విజేతలకు బంగారు వెండి, రజత పతకాలను అతిథుల చేతుల మీదుగా బహుకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యాలు అందరిని అలరింపజేశాయి. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాల్గొన్న నిజామాబాద్ ఏసీపీ ఏసీపీ, ధర్పల్లి సీఐ

పిహెచ్‌సిలో బోరు తవ్వకం పనులు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బోరు తవ్వకం పనులు ప్రారంభించినట్లు జెడ్పిటిసి సభ్యుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. జెడ్పి నిధులు రూ.లక్ష 25వేలతో ఈ బోరు తవ్వకం పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పిహెచ్‌సికి నీటి సౌకర్యం లేకపోవడంతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుజన్‌కుమార్, సర్పంచులు కిచ్చయ్యగారి సునీత, వంజరి సునీత, ఎంపీటీసీ మాధవితో పాటు నాయకులు ఫరీద్, సంతోష్‌గౌడ్, వంశీగౌడ్ తదితరులున్నారు



బోరు తవ్వకం పనులు

కూరగాయల సాగుకు సాహకరిస్తాం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతు బిక్కన్నగారి భాస్కర్, ఎల్లేష్ పండిస్తున్న టమాటా పంటను ఉద్యానవన అధికారి లోకేష్, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌వో మాట్లాడుతూ.. రైతులకు కూరగాయల సాగుపై సలహాలు సూచనలు తెలిపారు. సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ.. కూరగాయల సాగుచేసే రైతులకు అన్ని రకాల సహకారాలు అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సిద్ధిరాములు, కుమ్మరి రాజయ్య, శ్రీపాల్‌రెడ్డి, ఎల్లేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



టమాట పంటను పరిశీలన

బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలు తెలపాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

గత పార్లమెంటు, శాసనసభ ఎన్నికల సందర్భంగా జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలతో పాటు ప్రస్తుతం ఆరు మాసాలలో జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలు వెంటనే అందజేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యయ సునిశిత నియోజకవర్గాల గుర్తింపు (ఈఎస్సీఎస్), వ్యయ సునిశిత పాకెట్ (ఈఎస్‌పి) (కామారెడ్డి పట్టణ ప్రాంతంలోని కొంత భాగం)ల గుర్తింపు నిమిత్తం ఏర్పాటు చేసిన ఎన్నికల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుటకు గత ఎన్నికలలో జరిగిన అనుభవాలను మననం చేసుకొని వాటిని అధిగమించుటకు తగు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అందులో భాగంగా సమాన ప్రక్రియ పద్ధతి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను గత ఎన్నికలల్లో నియోజకవర్గంలో విచ్చలవిడిగా ధన వ్యయం చేసిన వివరాలను సెక్టార్ వారీగా సమగ్ర నివేదిక అందించాలన్నారు. ఏఎస్‌పిని గుర్తించుటకు నగదు, మద్యం, ఫిర్యాదులు ప్రామాణికమని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో జిల్లాలో 6 కోట్ల 65 లక్షల నగదు, మద్యం, మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకోగా అందులో కామారెడ్డి నియోజకవర్గంలో 4 కోట్ల 42 లక్షలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా సి విజిల్ యాప్ ద్వారా 157 కేసులు నమోదు కాగా.. అందులో కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి 39 కేసులున్నాయని అన్నారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న డబ్బు, మద్యం కేసులు నమోదు చేసిన వివరాలు, మాదక ద్రవ్యాల నిరోధక కింద నమోదు చేసిన కేసుల వివరాలు, తరచుగా నేరాలకు పాల్పడే వారి వివరాలు అందించాలన్నారు. గత ఎన్నికలల్లో నేరాలకు పాల్పడి రిజిస్టర్ చేసిన కేసుల వివరాలు, కుల, మత సంఘర్షణలు తదితర సంబంధించిన కేసుల వివరాలు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వివరాలు అందజేయవలసినదిగా కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్.డి.ఓ. శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ భార్గవ్, ఇంచార్జి ఆబ్కారీ అధికారి సుందల్ సింగ్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా, ఎన్నికల పర్యవేక్షకుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సిఎంఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎస్‌బిసి భవనం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ 2023-24 ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సిఎంఆర్ అందజేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో గత యాసంగిలో పండించిన 2,18,193 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉందని, ధాన్యాన్ని తక్షణమే మిల్లింగ్ పూర్తి చేసి సీఎంఆర్‌కు అందజేస్తామని తెలిపారు. బాయల్డ్ రైస్ 1,15,828 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉందని, త్వరగా మిల్లింగ్ చేయిస్తామని పేర్కొన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయని రైస్‌మిల్ యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

శనగ పంటకు పచ్చ పురుగు ఆశించకుండా చర్యలు చేపట్టండి

- రైతులకు ఏవో సూచన



పంటలను పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-మద్నూర్

శనగ పంటకు పచ్చ పురుగు ఆశించకుండా చర్యలు చేపట్టాలని రైతులకు మండల వ్యవసాయాధికారి సూచించారు. మద్నూర్ మండలంతో పాటు డోంగ్లి మండలాల పరిధిలో పంటలను ఆయన శనివారం పరిశీలించారు. ముఖ్యంగా అత్యధికంగా సాగుచేసిన శనగ పంటకు శనగపచ్చ పురుగు ఆశించే అవకాశాలు మెండుగా ఉంటాయని అలాంటి పురుగుల నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందజేశారు. అదేవిధంగా సాగుచేసిన పంటల వివరాలను ఇరు మండలాల్లోని ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పంటలపై సోకిన పురుగుల నివారణ గురించి పంటల పరిశీలనలో రైతులకు పిచికారీ మందుల గురించి ఆయన తెలియజేశారు.

రైస్ మిల్లర్లు తమ లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

రైస్ మిల్లర్లు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శనివారం రైస్‌మిల్ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవరి 7 వరకు తమ లక్ష్యాలను పూర్తి చేయని రైస్‌మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, రైస్‌మిల్లు యజమానులు పాల్గొన్నారు.

శ్రీజకు ఉత్తమ వికెట్ కీపర్ అవార్డు

- బ్యాటింగ్‌లో సైతం ప్రతిభ
- అభినందించిన ఎస్‌జిఎఫ్ ప్రతినిధులు



క్రీడాకారిణిని అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి శ్రీజ అనే అమ్మాయి అండర్ 17వ క్రికెట్ పోటీల్లో జిల్లా క్రికెట్ జట్టు నుంచి సారథ్యం వాయించింది. గత కొంతకాలం నుంచి భద్రాచలంలో అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు కొనసాగాయి. మొదటి నుంచి శ్రీజ తన ప్రతిభను వికెట్ కీపర్ రూపంలో చూయించింది. దాంతో పాటు బ్యాటింగ్‌లో సైతం సత్తాచాటారు. ఆడిన క్రికెట్ పోటీల్లో శ్రీజ అన్ని విధాలుగా రాణించడంతో ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఫౌండేషన్ నిర్వాహకులు ఆమెను అభినందించారు. అలాగే ఆమెకు సైతం మొదటి ప్రైస్ రావడంతో ఫౌండేషన్ క్రికెట్ నిర్వాహకులు ఆమెకు మెమొంటోను అందజేస్తూ ఘనంగా సన్మానించారు. జనవరి నెలలో జాతీయస్థాయిలో జరిగే అండర్ 17 ఇయర్స్ బాలికల క్రికెట్ పోటీల్లో శ్రీజ ఎంపికైనట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు భద్రాచలంలో జనవరి కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు ఎడపల్లి మండల శాఖ అధ్యక్షులు అభిమన్యు కూతురు శ్రీజకు పిఆర్‌టియు ఎడపల్లి మండల శాఖ అధ్యక్షులు అభిమానులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధిహామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- డిఆర్డిఏ పిడి చందర్ నాయక్
- ప్రజా వేదికలో బహిర్గతమైన ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంత కూలీలకు పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది పనులలో చేపట్టిన పలు అక్రమాలు, అవకతవకలు బహిర్గతమయ్యాయి. శనివారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో డిఆర్డిఏ పిడి చందర్‌నాయక్ రికార్డులను పరిశీలించగా చాలా గ్రామాలలో ఉపాధి హామీ పనులలో అవకతవకలు బహిర్గతమయ్యాయి. మస్టర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలు, కూలీల సంతకాలు లేకుండానే డబ్బులు చెల్లించడం లాంటివి పొరపాట్లు, అవకతవకలు బహిర్గతమయ్యాయి. బెల్లాల్‌లో సంతకాలు లేకుండా డబ్బులు చెల్లించినట్లు ప్రజావేదికలో వెలుగు చూసింది. ఈ గ్రామంలో సామాజిక తనిఖీ బృందాలు చేసిన పరిశీలనలో కొలతలలో తేడాలు ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో పని కావాలని చెప్పిన కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ పనులు కనిపించలేదని ప్రజా వేదికలో వెల్లడైంది. కూలి పని చేసిన ఎనిమిది మందికి హాజరు లేకుండా డబ్బులు చెల్లించలేదని, కూలీలకు పేస్లిప్పులు ఇవ్వడం లేదని, రైతు కూలీల సంతకాలు లేక మస్టర్లు ఖాళీగా ఉన్నాయని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ప్రజావేదికలో తేలింది. ఓ గ్రామంలో ఒకే చెరువులో అనేక వర్క్ ఐడీలతో పనిచేసినట్లు తేలింది. కొలతలలో తేడాలు వెలుగు చూశాయి. పెంటఖుర్దు గ్రామంలో పని కావాలని దరఖాస్తు చేసిన పని కల్పించడంలో నిర్లక్ష్యం చేసినట్లు, కొంతమంది కూలీలు 9 రోజులు పని చేసిన మస్టర్ రిజెక్ట్ చేయడం దాంతో కూలీలు వేతనం లేక నష్టపోయారు. ఓ కుటుంబానికి డబుల్ జాబ్ కార్డు రాయడంతో 4000 నష్టపోయినట్లు తేలింది. రిజిస్టర్ నిర్వహణలో నిర్లక్ష్యం, కొంతమంది కూలీలు పనిచేసిన కాలానికి కాకుండా తక్కువ రోజులు నమోదు చేయడంతో వారు వేతనం నష్టపోయినట్లు తేలింది. మావందిఖుర్దు గ్రామంలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు జాబ్‌కార్డు అందించకపోవడం, టి.ఎ.నాగార్జున ఏ గ్రామ సభకు కూడా హాజరు కాకపోవడం, ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నిర్లక్ష్యం లాంటివి వెలుగుచూశాయి. మస్టర్లు హాజరు లేకుండా కూలీలకు వేతనం చెల్లించినట్లు తేలింది. మరో గ్రామంలో పనిచేసిన వేతనం కంటే ఎక్కువ డబ్బులు చెల్లించినట్లు తేలింది. అలాగే ప్రతి నెల కూలీల హక్కులకు వివరించే రోజ్‌గార్ దివస్ సభను ఏ గ్రామంలోనూ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్వహించలేదు. దాంతో కూలీలకు వారి హక్కులు, వారికి అందించే సౌకర్యాలు ఎలా తెలుస్తాయని గ్రామాలలో రోజ్గార్ దివస్ సభలు ఎందుకు నిర్వహించలేదని డిఆర్డిఏ పిడి చందర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ మండలంలోని 38 గ్రామ పంచాయతీలలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన 4కోట్ల 80 లక్షల విలువగల పనులకు సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించారని, వాటి వివరాలు ప్రజావేదికలో వెల్లడించినట్లు తెలిపారు. గ్రామలవారిగా నివేదిక పరిశీలించామన్నారు.

ఈ ప్రజా వేదికలో ఉపాధిహామీ పనులలో తప్పిదాలు జరిగిన చోట సరిచేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. వేతనాల చెల్లింపులో అవకతవకలు జరిగిన చోట సంబంధిత వారి నుంచి వేతనాలు రికవరీ చేస్తామని పేర్కొన్నారు. మస్టర్లలో కొట్టివేతలు, రికార్డుల నిర్వహణ నిర్లక్ష్యం జరగకుండా భవిష్యత్తులో గ్రామ, మండల అధికారులు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రజా వేదికలో ఎంపీడీవో పర్బన్న, ఎంపీఓ మధుకర్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్ఆర్పిలు సాంబశివచారి, రాఘవులు, ఏపీవో హేమలత, టిఏలు, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

మోడీ సర్కార్ అభివృద్ధి సంకల్ప రథ యాత్ర



రథయాత్రలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మోడీ సర్కార్ నుంచి ప్రజలకు అందించే సంక్షేమ పథకాల రథయాత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రతి శాఖకు కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ అందించే సంక్షేమ పథకాలను ఆయాశాఖల అధికారులు ప్రజలకు తెలిపారు. మోడీ ప్రభుత్వం అందించే రైతుబంధు, రేషన్‌బియ్యం, సబ్సిడీ విత్తనాలు, ఉచిత ఆరోగ్య బీమా, ఉపాధి హామీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. తదుపరి మోడీ సర్కార్ క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నారాయణ, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, సర్పంచ్ దాసరి గంగారం, భారత్ గ్యాస్ నరసయ్య, ఎంపీఓ తారాచందు, ఏఎస్‌ఎం నీతుకా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి/లింగంపేట్

బి.ఆర్.ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు అజీమ్ మేనల్లుడు కబీర్ ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ శనివారం బాన్సువాడలోని ఆయన నివాసంలో పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గాంధారి ఎంపీపీ రాధాబలరాం నాయక్, గాంధారి సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు సంజీవ్ యాదవ్, ముదెల్లి సొసైటీ చైర్మన్ సాయిరాం, సర్పంచ్‌లు ఫారుక్, మల్లెబోయిన నారాయణ, పిట్ల కళావతి లక్ష్మణ్, ఎంపీటీసీ ఉమారాణి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేకరులకు పరామర్శ..

లింగంపేట్ : మండల కేంద్రానికి చెందిన విలేకరులను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు. లింగంపేట గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేఖరి గోష్కే దుర్గయ్య తండ్రి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు అదేవిధంగా మన తెలంగాణ విలేఖరి బొల్లు శ్రీకాంత్ కాలికి శస్త్ర చికిత్స కావడంతో ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గుండా బాలకిషన్, నరహరి, పరంధాములు ముదాం సాయిలు, సుప్పాల నరేష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

అయోధ్య రామ పూజిత అక్షింతల శోభయాత్ర



అక్షింతల శోభయాత్రలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో శ్రీ అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ లింగంపేట్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ అయోధ్య రామ పూజిత అక్షింతలను శనివారం ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయం నుంచి రామాలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తుండడంతో అయోధ్యలో బాల రాముడు క్షేత్రంలో 108 రోజులు ఎంతో నిగ్రత పూజింపబడిన అక్షింతలను వచ్చేనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అయోధ్యలో రాముని రాక జరుగుతుండడంతో ప్రతి ఇంటిలో దీపావళి జరుపుకోవాలని కోరారు. జనవరి 22న ప్రతి ఇంటిలో ఐదు దీపాలను వెలిగించాలని కోరారు. శోభాయాత్రలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శబరిమలైలో అన్నదానం కోసం 26 క్వింటాళ్ల బియ్యం వితరణ

నవతెలంగాణ-మద్నూర్

జనవరిలో శబరిమలై ఆలయం వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి మద్నూర్ మండల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 26 క్వింటాళ్ల బియ్యంను పలువురు ముందుకు వచ్చి వితరణ చేశారు. ఈ బియ్యాన్ని లారీలో శబరిమలైకి తరలించే ఏర్పాట్లు చేశారు. గురుస్వామి చౌలావార్ హనుమాన్లు, అలాగే మోహన్, రాజు, స్వామి పలువురు అయ్యప్ప స్వాములు బియ్యం శబరిమలైకి తరలించే కార్యక్రమంలో పాల్గొన్నారు.



తరలించేందుకు సిద్ధం చేసిన బియ్యం

ప్రతినెల 30 వరకు పెన్షన్లు అందించాలి

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వజ్జా వెంకట్రావు
- ఘనంగా పెన్షనర్స్ డే దినోత్సవం

నవతెలంగాణ-బోధన్

రిటైర్డ్ పెన్షన్ దారులకు ప్రభుత్వం ప్రతినెల 30వ తేదీ వరకు పెన్షన్లను అందించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పింఛన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వజ్జా వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలోని గోశాలలో బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈపీఎస్ పెన్షన్‌దారులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు 9000 రూపాయలు అందించాలని అన్నారు. బకాయిలు ఉన్న 3 డీఏలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. 15శాతంతో కూడిన పి.ఆర్.సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్లకు నోషన్ ఇంక్రిమెంట్లు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్లుగా తెలంగాణలో అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో, కార్పొరేట్ ఆసుపత్రిలో హెల్త్ కార్డులను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య సంబంధ బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ తూము పద్మావతి మాట్లాడుతూ.. పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎలాంటి ఇబ్బందులు పడవద్దని మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి అన్నారు. అనంతరం పెన్షన్‌దారుల అసోసియేషన్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కోఆర్డినేటర్ పద్మాసింగ్, జనరల్ సెక్రటరీ అద్దంకి హూషన్, నర్సింగరావు, జ్ఞానేశ్వర్, సత్యానంద్, కోటేశ్వరరావు, అద్దంకి లింగయ్య, గంగారం, రాజలింగం, హన్న మేరీ, భారతి, పార్సి ప్రకాశం, నరసింహ స్వామి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ల ప్రతినిధిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ పద్మావతి

హై వోల్టేజ్ కరెంట్‌తో ఇల్లు దగ్ధం

- సుమారు రూ.2లక్షల 50 వేల ఆస్తి నష్టం



ఇల్లు దగ్ధమవడంతో రోదిస్తున్న బాధితురాలు

నవతెలంగాణ-మాచారెడ్డి

హై వోల్టేజ్ కరెంట్‌తో ఇల్లు దగ్ధమైంది. సుమారు రూ.2లక్షల 50 వేల ఆస్తి నష్టం సంభవించింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన పాపగారి రఘుపతి ఇంటిలో కరెంటులో హైవోల్టేజ్ రావడంతో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇల్లు దగ్ధమైంది. ఇటీవలే పంట అమ్మిన డబ్బులు రూ.2లక్షల 50వేలు, ఒరిజినల్ పట్టా పాస్ బుక్కు, ఆధార్ కార్డు, టెన్త్, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్స్ విలువైన పత్రాలు దగ్ధమయ్యాయి.

విద్యార్థులను చితకబాదిన శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యానికి మెమో జారీ

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులను చితకబాదిన పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలపై వివిధ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు వచ్చిన ఫిర్యాదుల మేరకు శనివారం మెమో జారీ చేసినట్లు మండల విద్యాధికారి రాజా గంగారం తెలిపారు. ఇటీవల పాఠశాల పై అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఎవరో గుర్తుతెలియని వారు పగలగొడితే. అందుకు కారణం మీరే అంటూ ఇద్దరు పదవ తరగతి విద్యార్థులను చితకబాదారు. దీనికి కారణం ఎవరని నిజనిర్ధారణ చేసుకోకుండానే తమ పిల్లలను కొట్టడం, మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు డిఇఓ దుర్గాప్రసాద్, మండల విద్యాధికారికి, పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. వివరణ కోరుతూ పాఠశాల యాజమాన్యానికి మెమో జారి చేసినట్టు ఎంఈవో తెలిపారు.

న్యాయచైతన్య సదస్సులో 2003 కేసులు పరిష్కారం

నవతెలంగాణ-ఆర్మూర్



జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం పట్టణ కోర్టు 2003 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంఘం చైర్‌పర్సన్ నసీం సుల్తానా తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సరసం చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

నవతెలంగాణ-కమర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన గౌడ సంఘం మండల అధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్ తన వంతు సహాయంగా రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సురంగి చంద్రశేఖర్, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వంపై ఉక్కుపాదం మోపుతున్న పాలకవర్గాలపై విద్యార్థులు ఉద్యమించాలి



మాట్లాడుతున్న గొర్రెపాటి మాధవరావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యారంగంలో స్వేచ్ఛ, ప్రశ్నించే తత్వంపై ఉక్కుపాదం మోపుతున్న పాలకవర్గాలపై విద్యార్థులు ఉద్యమించాలని ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు గొర్రెపాటి మాధవరావు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లో నీలం రామచంద్రయ్య భవన్ కోటగల్లి లో పిడిఎస్‌యూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా గొర్రెపాటి మాధవరావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. 2020 నూతన జాతీయ విద్యా విధానం ద్వారా యూనివర్సిటీల స్వేచ్ఛను దెబ్బతీయటం, విద్యారంగంలో స్వేచ్ఛ, ప్రశ్నించే తత్వం పై ఉక్కు పాదం మోపడంతో పాటు భారతీయ సంస్కృతి పేరుతో విద్యలో మత జోక్యాన్ని పెంచి విద్యా లక్ష్యాలను దెబ్బతీస్తుందని అన్నారు. మూఢనమ్మకాల అశాస్త్రీయ భావజాలాన్ని పెంచే విద్యను ముందుకు తెచ్చారని అభ్యంతరం వ్యక్తం చేశారు.దీనిపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యను ప్రైవేట్ కార్పొరేటు సంస్థల కబంధహస్తాల నుండి బయటకు తెచ్చే బాధ్యత విద్యార్థులపైన ఉందన్నారు. నరేంద్ర మోడీ హక్కులు, ప్రజాస్వామికత, లౌకికత్వాలను నిరాకరిస్తూ వస్తున్నాడని తెలిపారు. దీన్ని ప్రజాస్వామికవాదులు ఎండగట్టాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను ఇఫ్టు జిల్లా అధ్యక్షులు బి భూమయ్య, గతితార్కిక భౌతికవాదం అంశంపై కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత వివరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆర్.గౌతమ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు కార్తిక్, సహాయ కార్యదర్శి ప్రిన్స్, కోశాధికారి దేవిక, జిల్లా నాయకులు మనోజ్, రవీందర్, నిఖిల్, అక్షయ్, వంశీ, స్వాగత్, గౌతమి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ పార్టీ



నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలోగల విజయ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ప్రెషర్ పార్టీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెలారే రెలా ఫేం గంగా విచ్చేసి విద్యార్థులను అలరించారు. కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డిప్లొమా విద్యార్థులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, అలాగే ఇంటర్ లెవెల్ స్పోర్ట్స్‌లో గెలుపొందిన డిప్లమా విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డా. గణేష్ మాట్లాడుతూ, డిప్లొమా విద్య అర్హత తోనే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వివిధ సంస్థలు, డిప్లొమా విద్యార్థులను ఎంపిక చేసుకోవడానికి ముందుకు వస్తున్నాయని, రానున్న రోజుల్లో ప్లేసెమెంట్స్ ఉంటాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యత పెంచుకోవాలని కోరారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సురేష్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన విద్యార్థులు, ప్రపంచంలో నలుమూలల విస్తరించారని, అన్ని రంగాల్లో గుర్తింపు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సింగర్ రెల రే రెలా గంగ, గోదావరి పాటలతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి : డిఎల్‌పిఓ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన నువ్వు సద్వినియోగం చేసుకోవాలని డిఎల్ పి ఓ శ్రీనివాస్ ,తహసిల్దార్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకోసం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నందున దరఖాస్తులకు వచ్చేనెల ఆరవ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యాళ్ల రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోజుకు 2 వేల ఓపి.. 400 మంది ఇన్‌పేషంట్‌లకు వైద్యం

- ఏడాదిలో 4,41,452 మందికి రక్త పరిక్షలు
- అరుదైన శస్త్ర చికిత్సలు
- 6,600కాన్పులు
- లాప్రోస్కోపిక్ సర్జరీల్లో రాష్ట్రంలో మొదటి స్థానం
- వివరాలు వెల్లడించిన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 2023లో చేసిన అరుదైన శస్త్రచికిత్సలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ వివరించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈఆర్థిక సంవత్సరంలో ఆస్పత్రిలో ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించామని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని అన్నారు. ఆస్పత్రిలో బయట పేషంట్ల సంఖ్య రోజుకి 1500 నుండి 2000 వరకు పెరిగిందని, ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా రోజుకు 200 నుండి 400 వరకు పెరిగిందని తెలిపారు. అత్యాధునిక పరికరాలను ఏర్పరచామని, నూతన సాంకేతిక విజ్ఞానంతో చికిత్సలను అందించామని అన్నారు. వివిధ విభాగాల వారీగా జరిగిన అభివృద్ధి అరుదైన చికిత్సలను విభాగాధిపతులు వివరించారు. టిహబ్ (తెలంగాణా డయాగ్నొస్టిక్) ద్వారా ఈ ఏడాది 4,41,452 మందికి రక్త పరిక్షలు నిర్వహించామని, టిహబ్ సెంటర్ రాష్ట్రంలో 2 వ స్టానంలో ఉందని తెలిపారు. సైకియాట్రి విభాగంలో డి అడిక్షన్ సెంటర్ ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామని, ఈ సిటీ విధానం ద్వారా చికిత్సను అందించి ఆత్మహత్యలు చేసుకోవాలనే వారి ఆలోచనలను నివారిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 214 మందికి ఈ-సిటీ ద్వారా చికిత్స చేశామన్నారు. 1912 మందికి డి అడిక్షన్ ద్వారా చికిత్స చేశామన్నారు.పీడియాట్రిక్ విభాగంలో పిఐసియు ఏర్పాటుచేశామని, ఇందులో వెంటిలేటర్ ద్వారా 56 మందికి చికిత్స అందించామన్నారు. ఎస్ఎన్సీయూలో వెంటిలేటర్లను ఏర్పాటు చేసి 28 రోజుల లోపల గల నవజాత శిశువులు 70 మందికి వైద్యం చేశామన్నారు. తీవ్ర పసిరికలతో ఉన్న ఒక నవజాత శిశువుకు డబుల్ వాల్యూమ్ ఎక్స్ఛేంజ్ ట్రాన్స్ ఫ్యూజన్ రక్తమార్పిడి విధానం ద్వారా కచ్చితంగా చికిత్సను అందజేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ఇది ప్రైవేట్‌లో సుమారు 2 నుంచి 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఎముకల విభాగంలో సుమారు 42 వేల మంది బయట పేషెంట్లను చూశామని, ఈ విభాగంలో మేజర్ సర్జరీలు 1703 , మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు 81, మైనర్ సర్జరీలు 500కు పైగా నిర్వహించామన్నారు. ఈ విభాగంలో ఐఎల్ఐజెడ్ఏఆర్ ఓవి అరుదైన శస్త్ర చికిత్సను నలుగురు పేషెంట్లకు నిర్వహించామని తెలిపారు. జనరల్ సర్జరీ విభాగంలో 46,800 అవుట్ పేషెంట్, 7వేల ఇన్ పేషెంట్, మేజర్ సర్జరీలు 2500 వరకు నిర్వహించామని తెలిపారు. ఇన్ పేషెంట్ల అడ్మిట్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానం లాప్రోస్కోపిక్ సర్జరీల్లో రాష్ట్రంలో మొదటి స్థానం, మేజర్ సర్జరీలలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఈ సంవత్సరంలో కాలేయానికి సంబంధించిన ఒక అరుదైన హెచ్‌వైఏటిఐడి సీవైఎస్‌టి అనే శస్త్ర చికిత్సను ఒకవ్యక్తికి నిర్వహించామని అన్నారు. ఈ ఏడాది లో 6600 కాన్పులు చేశామని, అందులో 3600 సాధారణ కాన్పులు జరిగాయన్నారు. ఎన్నో హైరిస్క్ సర్జరీలో నిర్వహించారని తెలిపారు సిజేరియన్ రేటు తగ్గించి సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. గర్భిణీ స్త్రీలు రెగ్యులర్‌గా పరీక్షల నిర్వహించుకోవాలని జిజి హెచ్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, టిపా స్కానింగ్ ఇంకా ఇతర సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. వార్డుల్లో గర్భిణీల సమస్యలను డాక్టర్లకి చేరవేసి సత్వర పరిష్కారం జరిపించే విధంగా కౌన్సిలర్లను ఏర్పాటు చేశారు. డెంటల్ విభాగంలో మ్యాక్సిలో ఫేషియల్ చికిత్స ఈ ఏడాది లో 310 వరకు నిర్వహించామన్నారు. ఈ ఏడాది డెంటల్ ఓపి 14,400 మందికి చూశామన్నారు. రూట్ కెనాల్ 720 మందికి చికిత్స అందించామని తెలిపారు. ఆస్పత్రిలో ఈ ఏడాదిలో 380 డయలసిస్ నిర్వహించామన్నారు. అక్యూట్ కిడ్నీ సమస్యలకు కూడా చికిత్స అందిస్తున్నమని తెలిపారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులు చికిత్స తరువాత వారే స్వయంగా నడిచారన్నారు. వెంటిలేటర్ మీద చికిత్స పొంది బతికారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, చికిత్స పొందిన బాధితులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీకి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

- సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల జారీకి ప్రథమప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీల అమలు కోసం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ప్రభుత్వం హామీఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులను యుద్ధ ప్రాతిపదికన అందజేయాలన్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ సర్కారు రేషన్ కార్డులు ఇవ్వకుండా తాత్సారం చేసిందన్నారు. పెళ్లిళ్లై పిల్లలతో ఉమ్మడి కుటుంబాల నుండి విడిగా బతుకుతున్నారన్నారు. వీరందరూ రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. అదేవిధంగా ప్రజా పాలన దరఖాస్తు ఫారాలు డిమాండ్ మేరకు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవసరం మేరకు దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ అధికారులు పైరవీలకు తావులేకుండా అర్హులను గుర్తించి,సంక్షేమ పథకాలు అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పీవైఎల్ నాయకులు మారుతి గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు టి.విఠల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాటాడుతున్న సుధాకర్

జల్సాల కోసం బైక్‌లు చోరీ

- ఘరానా బైక్ దొంగల ముఠా అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జల్సాల కోసం బైక్‌లను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మూటో పోలీస్ స్టేషన్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురిని అరెస్ట్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మూడో పట్టణ ఎస్ఐ ప్రవీణ్ వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు చంద్రశేఖర్ కాలనీ బైపాస్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు షేక్ మాజీద్, మహమ్మద్ అమన్, షేక్ సాజిద్ లు రెండు ద్విచక్ర వాహనాలను వదిలి పారిపోతుండగా ఎస్సై, సిబ్బంది వెంబడించి వారిని పట్టుకుని విచారించగా.. 9 బైక్‌లు చోరీ చేసినట్టు తేలింది. వాటిని షేక్ ఫైజల్లా అను జల్లపల్లికి చెందిన వ్యక్తికి నాలుగు ద్విచక్ర వాహనాలు, ధర్మాబాద్, బైంసాకు చెందిన వ్యక్తులకు అమ్మినారు. జల్సాలకు అలవాటు పడి ఏదైనా దొంగతనాలు చేసి డబ్బులు సంబంధించి జల్సా లకు వాడుకుందామని ఉద్దేశంతో పై ముగ్గురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి నిజాంబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిలిపించినటువంటి ద్విచక్ర వాహనాలను దొంగిలించి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్టు తెలిపారు. ముగ్గురు వ్యక్తులతో పాటు బైక్ కొన్న షేక్ సైజుల్ల అనే కోటగిరికి చెందిన వ్యక్తిని కూడా అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి మొత్తం ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరుచుకుని కోర్టు ఎదుట హాజరు పరిచినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన మూడో పట్టణ ఎస్సై ప్రవీణ్, సిబ్బంది షౌకత్ అలీ, చామీంద్, అఫ్సర్‌లను నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ

దరఖాస్తు ఫాంలు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన అభయహస్తం ఆరు గారంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన టేబుల్లను సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. సుంకేట రవి మాట్లాడుతూ... అధికారులు ప్రజలకు అవసరమైన మేరకు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. దరఖాస్తులకు ఎలాంటి రుసుము చెల్లించొద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చి మల్లయ్య, కొమ్ముల రాజేందర్, అల్లకొండ రాజేష్, సుర స్వామి, మేడిపల్లి రిక్విత్, ఫూటూర్ ప్రదీప్, బాలయ్య కుంట ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



టీయూలో ఆరోగ్య కేంద్రం ఉన్నా డాక్టర్ లేరు..

- అధికారులు చూడనట్టు ఉండటం దారుణం
- ఎన్ఎస్‌యుఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఆరోగ్య కేంద్రం ఉన్న డాక్టర్ లేని దుస్థితి నెలకొందని, వర్సిటీ అధికారులకు అన్ని విషయాలు తెలిసిన చుసి చూడనట్లు చేయడం దారుణమని, డాక్టర్‌ను నియమించాలని తెలంగాణ యూనివర్సిటీలోని హెల్త్ కేర్ వద్ద ఎన్ఎస యు ఐ అధ్యక్షులు శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం హెల్త్‌కేర్‌వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు హాస్టళ్లను సందర్శించడంలేదని, హెల్త్ కేర్ లో కనీసం టాబ్లెట్లు లేని దుస్థితి నెలకొని ఉందన్నారు. హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని, అధికారులు హాస్టల్లను సందర్శించాలని అనేకసార్లు వినతి పత్రాలు అందించిన పాలన యంత్రాంతం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. హాస్టల్లో నాణ్యత గల భోజనాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు నెలలుగా డాక్టర్ లేరన్నారు. తక్షణమే డాక్టర్ని నియమించి అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ కేర్ లో ఒక స్లీపర్, నలుగురు సిస్టర్స్ ఉండాలి కానీ ఇద్దరే ఉన్నారని, సెక్యూరిటీ, ల్యాబ్ టెక్నీషియన్ లేరన్నారు. స్పోర్ట్స్ బోర్డ్ ఏర్పాటు చేశారే కానీ నిధులు లేవని, ప్రతి యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డ్ కు ప్రత్యేక బడ్జెట్ ఉంటుందని తెలిపారు. ఈ నిధులతో క్రీడా మైదానం అభివృద్ధి, పరికరాల కొనుగోలు అంతర్ యూనివర్సిటీ పోటీలకు వెళ్లే ప్రతి క్రీడాకారుడికి కిట్లు, రవాణా ఖర్చులు చెల్లిస్తారన్నారు. యూనివర్సిటీ తరఫున ఇతర ప్రాంతాల్లో నిర్వహించే టోర్నీలకు వెళ్లే వారికి బడ్జెట్ లేదని చేతులు దులుపుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ వస్తే ఉన్నత చదువులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందని ఆశతో క్రీడాకారులు సొంతంగా ఖర్చులు భరిస్తూ టోర్నీలకు హాజరవుతున్నారని తెలిపారు. తక్షణమే ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ యూనివర్సిటీని సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిజిస్ట్రార్ హెల్త్ సెంటర్ ను సందర్శించాలి సమస్యలను పరిష్కరించగలరని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ వైస్ ప్రెసిడెంట్ మహేష్, అభినయ్, ప్రధాన కార్యదర్శి సాగర్ నాయక్, కార్యదర్శి రాజేందర్,రాము, విజయ్,అనిల్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో నూతన సంవత్సర సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకల తో పాటు నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ముందుగా కేక్ కట్ చేసి ఈ నూతన సంవత్సర వేడుకల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు రంగురంగుల దుస్తులు ధరించి ఆటపాటలతో , నృత్యాలతో చాలా ఉత్సాహంగా. కేరింతల ఈ నూతన సంవత్సర వేడుకల్లో అలరించారు. వారి వారి తరగతుల్లో కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లా డుతూ ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం అనుభవాలను జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కొత్త సంవత్సరం అందరూ ఆనందంగా ఉండాలని, ప్రతి ఒక్కరికి మేలు జరగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్ , సాగర్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్‌కట్‌చేస్తున్న పాఠశాల యాజమాన్యం, పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 31, 2023 | www.navatelangana.com

సీఎంను కలిసిన బోధన్ ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గ మాజీమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ నగర అధ్యక్షులు కేశ వేణు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ఎలాంటి సమస్యలు ఉన్న తక్షణమే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు వారు తెలిపారు.

జారి కింద పడి హెూంగార్డు మృతి

నవతెలంగాణ-రెంజల్



జారి కింద పడటంతో హెూంగార్డు మృతిచెందాడు. మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన ఎం.రవీందర్‌గౌడ్ (35) తన విధులు ముగించుకుని కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి కాలుజారి కిందపడి మృతి చెందాడు. స్థానిక ఎస్సై ఉదయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అధికారిక లాంఛనాలతో మృతదేహానికి నివాళులర్పించారు. బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. మృతుడు రవీందర్‌గౌడ్ కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రవీందర్‌గౌడ్ గత కొన్ని సంవత్సరాలుగా నిజామాబాద్ హెడ్ క్వార్టర్‌లో విధులను నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం పదివేల రూపాయల చెక్కును పోలీస్ శాఖ అందజేసింది.

అర్హులైన కుటుంబాలు దరఖాస్తు చేసుకోవాలి



కామారెడ్డి : దరఖాస్తు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : ప్రజా పాలనలో ప్రభుత్వం అందిస్తున్న అభయహస్తం ఆరు గ్యారంటీలు అర్హత గల ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోనేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శనివారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్, తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ఎవరైనా ఆధార్, రేషన్‌కార్డు చూపించి, దరఖాస్తు ఫారం తీసుకొని నింపి ఇవ్వాలని తెలిపారు. ఎంపీడీవోలు గ్రామ పంచాయతీల వారీగా దరఖాస్తు ఫారాలు అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునేలా చూడాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని పెద్దఎక్లారా గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ హారిక శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన తహసీల్దార్ ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఆ తర్వాత సర్పంచ్ హారికా శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు అయితే ప్రజా సంక్షేమానికి ముందడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్నూర్ సింగిల్ విండో చైర్మన్, శ్రీనివాస్ పటేల్, గ్రామ కార్యదర్శి కృష్ణవేణి, ఇతర శాఖల అధికారులు, గ్రామపెద్దలు, హనుమంతరావు దేశాయ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : మండలంలో నెహ్రూనగర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల దరఖాస్తులను ఎంపీడీఓ బేషీరుద్దీన్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌రావు స్వీకారించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి సంక్షేమ పథకాల దరఖాస్తులను స్వీకరించారు.



మద్నూర్ : పెద్దఎక్లార గ్రామంలో..



నాగిరెడ్డిపేట్‌లో..

పిట్లం : గ్రామప్రజలు అభయహస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిఓ బ్రహ్మం సూచించారు. మండలంలోని రాంపూర్ (కలాన్) గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ ఓపికతో క్రమ పద్ధతిలో తమ దరఖాస్తులను ఆయా కౌంటర్లలో అందజేయాలన్నారు. అభయ హస్తంలో పొందుపరిచిన ఆరుగ్యారెంటీ పథకాలకు గాను సంబంధించిన పూర్తి వివరాలను కౌంటర్ అధికారులకు వివరించినట్లయితే వారి సహకారంతో తప్పులు లేని దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, సర్పంచ్ నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని అంబం(వై) గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ ప్రజాపాలన కార్యక్రమంతో పాటు గ్రామసభను అధికారులు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గంగాప్రసాద్ అధ్యక్షతన వహించారు. సర్పంచ్ గంగ ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బిల్ కలెక్టర్ లక్ష్మణ్, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

మంగళ్‌పహాడ్‌లో..

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామపంచాయతీలో ప్రజలు దరఖాస్తులను అందజేశారు. సర్పంచ్ బట్టు హన్మండ్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, బిల్ కలెక్టర్ పద్మావతి, అంగన్వాడీ ఉపాధ్యాయులు బండ కళ్యాణి, అనురాధ, ఆసుపత్రి ఏఎన్ఎంలు శాంత, శైలజ, ఆశావర్కర్లు విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు.

6 వరకు దరఖాస్తులు స్వీకరించాలి..

లింగంపేట్ : ప్రజాపాలన దరఖాస్తులు జనవరి ఆరో తేదీ వరకు స్వీకరించాలని ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ప్రభాకర్ అధికారులకు సూచించారు. మండలంలోని పర్మల్ల గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు తప్పులు ఉన్నట్లయితే లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, సర్పంచ్ పరువయ్య, కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ..

రెంజల్ : మండలంలోని వీరన్నగుట్ట, కందకుర్తి, వీరన్నగుట్ట తాండ, సాటాపూర్ గ్రామాలలో ప్రజాపాలన పథకంపై అధికారులు ప్రజలకు వివరించారు. వీరన్నగుట్ట సర్పంచ్ బైండ్ల రాజు, కందకుర్తి సర్పంచ్ మీర్జా కలీం బేగ్, వీరన్న గుట్ట సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్, సాటాపూర్ సర్పంచ్ వికార్‌పాషా అధ్యక్షతన లబ్ధిదారులకు దరఖాస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులైన వారందరికీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డులతో పాటు తెల్ల రేషన్ కార్డును జతపరచాలని ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రామచందర్ సూచించారు. ఎలాంటి కొట్టివేతలు లేకుండా దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుందని వారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్ ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం, పిఆర్ఏఈ వినయ్‌కుమార్, ఏపీఎం భాస్కర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గోపికృష్ణ, అజయ్, భాగ్యశ్రీ, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, ఎంపీటీసీ అసాద్ బేగ్, ఉప సర్పంచులు ఇమ్రాన్, దేవోళ్ళ యోగేష్, వీరేందర్, లతా సాయిలు, గ్రామ కార్యదర్శులు రాజు, వెంకటరమణ, నవీన్, మహబూబ్ అలీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

మూడవరోజు ప్రజాపాలనలో 528 దరఖాస్తుల స్వీకరణ..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని ప్రజాపాలన దరఖాస్తులు మూడు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆత్మకూర్, రాఘవపల్లి, లింగంపల్లి గ్రామాలలో ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రఘు మాట్లాడుతూ.. ఆత్మకూరు గ్రామంలో 251, రాఘవపల్లిలో 203, లింగంపల్లిలో 74 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో రఘు తెలిపారు. ఈ నెల 28న ప్రారంభించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో గత మూడు రోజులుగా 1878 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాల్‌రెడ్డి వెంకట్రాంరెడ్డి, కుమార్, ఆయా శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-లింగంపేట్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఉమేష్ (23) ఎల్లారెడ్డి జియో కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మెదక్ వెళ్తుండగా మార్గమధ్యలో శెట్టిపల్లి సంగారెడ్డి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఎల్లారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భార్య రాలేదన్న మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-పిట్లం

తన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రానందున మనస్థాపం చెందిన వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ లింబాద్రి కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన ఆత్మకూరి రవికుమార్ (30) ప్రైవేట్ ఉపాధ్యాయుడు తన భార్య భాను పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని మనస్థాపం చెంది తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొన ఊపిరితో ఉండగా రవి తల్లి చూసి కాలనీవాసుల సహాయంతో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యం మద్దెల్ చెరువు వద్ద మరణించాడు. మృతుడి తల్లి రత్నవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి ఇద్దరు మగ కవలలున్నారు.

జాతీయ మానవ హక్కుల కమిటీ ఈసీ సభ్యునిగా లక్ష్మీ నరసయ్యగౌడ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్‌గౌడ్ కుమారుడు ఎ.లక్ష్మీనరసయ్య గౌడ్ జాతీయ మానవ హక్కుల కమిటీ ఈసీ సభ్యుడిగా ఎంపికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు బద్దిపడగ శ్రీనివాసరెడ్డి శనివారం ఆయనకు ఈసీ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసయ్యగౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మానవ హక్కుల కమిటీ ఈసీ సభ్యుడిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పలువురిపై కేసు కొట్టివేత

నవతెలంగాణ-సదాశివనగర్

2023 ఆగస్టు 14న ఎల్లారెడ్డిలో కేటీఆర్ పర్యటనలో భాగంగా లింగంపేట్ మండలంలో కేటీఆర్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులపై కేసు నమోదు చేశాడు. అయితే శనివారం కోర్టులో కేసు కొట్టివేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సంపత్‌గౌడ్, ఎల్లారెడ్డి యూత్ అధ్యక్షులు అజార్, ప్రవీణ్‌గౌడ్, నగేష్, సంతోష్, కృష్ణ, కిరణ్, సురేష్, రాము, ముదేలి, మోహన్, మాజీ సర్పంచ్ గణేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలు చేయడం అభినందనీయం

నవతెలంగాణ-ఆర్మూర్

గత ఐదు సంవత్సరాల నుండి పెర్కిట్ బొర్ర గణపతి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములై ఉచితంగా క్యాలండర్లు అందజేయడం అభినందనీయమని 4, 24 వార్డుల కౌన్సిలర్లు పాలెపు రాజు, లిక్కి శంకర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బొర్ర గణపతి దేవాలయంలో శనివారం ఆనంద్ ప్రింటర్స్ ప్రొప్రైటర్ తయారు చేయించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు పసుపుల సాయినాథ్, కోశాధికారి పెద్ద కాపు రాజు, సభ్యులు ప్రసాద్, భూమన్న, సంజీవ్ కాలనీవాసులు పసుపుల రఘునాథ్, బట్టు రఘుపతి, గంగాధర్, ఆలయ పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమకార్డులు అందజేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో శనివారం కార్మిక శాఖ అధికారులు 100 మంది కార్మికులకు సంక్షేమ కార్డులను అందజేశారు. అలాగే నిర్మాణరంగ కార్మికులకు హెల్మెట్లు, టీ షర్టులు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ గుప్తా మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు కలిగి ఉండాలని అన్నారు. కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకున్న కార్మికులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఊట్‌పల్లి సర్పంచ్ కృష్ణ, రాజీవ్‌నగర్ సర్పంచ్ రంజ్యానాయక్, కో - అప్షన్ మెంబర్ డి. వి. సంతోష్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



పంపిణీ చేసిన చెక్కులు చూపుతున్న దృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని గోర్గాల్ గ్రామంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 70 మంది లబ్ధిదారులకు గాను 64 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లి అయినా చాలా రోజుల తర్వాత చెక్కులు రావడం బాధాకరమని తెలిపారు. తమ ప్రభుత్వంలో పెళ్లిరోజు లక్ష రూపాయలు, తులం బంగారం పెళ్లిరోజు అందించే దిశగా రూపకల్పన చేస్తున్నామని, దీనిని వెంటనే అందిస్తామని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో కొందరి మీద కక్ష సాధింపులు చేశారని కళ్యాణ లక్ష్మి చెక్కులు రాకుండా గత పాలకులు అడ్డుపడ్డారని అవన్నీ నా దృష్టికి వచ్చాయని ఆయన అన్నారు. ఇప్పుడు వాళ్ళందరికీ కూడా అధికారులతో సర్వే చేయించి అందరికీ కూడా ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో సాయగౌడ్, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎమ్మార్వో బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన క్యాతం అశోక్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై ఉదయ్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. ఆ ఇసుక ట్రాక్టర్లు సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటాలు :ఎస్ఎఫ్ఐ

- ఘనంగా 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న విశాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజమాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోటగల్లీలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని నగర అధ్యక్షులు విశాల్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి విశాల్ మాట్లాడుతూ.. విద్యార్థి పోరాటాలకు దిక్సూచి అయిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 1970 డిసెంబర్ 30,31 తేదీలలో కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం పట్టణంలో ఆవిర్భవించిందన్నారు. అధ్యయనం - పోరాటం నినాదాలతో దేశవ్యాప్త విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 54 సంవత్సరాలుగా విద్యార్థులను, ప్రజలను చైతన్యపరుస్తూ భగత్ సింగ్, సావిత్రి బాయి, అంబేద్కర్ లాంటి మహనీయుల స్ఫూర్తితో సమసమాజన స్థాపనకై కృషి చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే విద్య వ్యతిరేక విధానాలపై నిరంతరం మిలిటెంట్ పోరాటాల నిర్వహిస్తూ, ప్రాణ త్యాగాలకు కూడా వెనుకాడని ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. దేశంలో అత్యధిక మెంబర్షిప్ కలిగిన సంఘం ఎస్ఎఫ్ఐ అని కొనియాడారు. కొఠారి కమిషన్ ప్రకారం విద్యపై కేంద్ర ప్రభుత్వం 10శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో 30శాతం కేటాయించాలని పేర్కొన్న పాలక ప్రభుత్వాలు విద్యను విస్మరించడం దారుణమని అన్నారు. 76 సంవత్సరాలు స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికి విద్యను కొనుక్కునే పరిస్థితిలోనే ఉండటం దారుణం అని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో కార్పొరేట్ వారికి లాభం చేకూరేలా చేస్తూ పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర చేస్తుదన్నారు. ఈ నూతన జాతీయ విద్యావిధాన రద్దుకు మేధావులు, విద్యార్థులను కలుపుకొని ఎస్ ఎఫ్ఐ పోరాటాలు కొనసాగిస్తుందని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, అమ్మాయిలను పుట్టనిద్దాం -చదవనిద్దాం -ఎదగానిద్దాం కాపాడుకుందాం అనే నినాదాలను ముందుకు తీసుకపోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని తీసుకొచ్చేంతవరకు పోరాటాలు చేస్తూనే అందరికి విద్య-అందరికి ఉపాధి కల్పనకు కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి గణేష్,సందీప్ ,నాయకులు వేణు శైలజ,శివ కుమార్, నిఖిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగట్లో ప్రజా పాలన దరఖాస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా ప్రజలు దరఖాస్తు చేసుకునే ఫారాలను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తుందని ప్రకటించినా.. రెడ్డిపేటతో పాటు రామారెడ్డిలో ఒక్కో దరఖాస్తు ఫారం జిరాక్స్‌ను, జిరాక్స్ సెంటర్లో రూ.పదికి విక్రయిస్తున్నారు. అధికారులను వివరణ కోరగా.. గ్రామానికి సరిపోయే ఫారాలను సరఫరా చేయగా, ప్రజలు ఇండ్లలోకి తీసుకెళ్లారని, కొందరికి అందలేవని అన్నారు.

గతేడాది కంటే నేరాలు తగ్గాయ్

- కామారెడ్డి ఎస్పీ సిహెచ్ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

గతేడాది కంటే ఈ సంవత్సరం నేరాలు తగ్గాయని, దొంగతనం కేసులో ఈ సంవత్సరం కొంత మేర పెరిగిన మహిళా సంబంధిత నేరాలు, హత్య నేరాలను కొంత మేర తగ్గించగలిగినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనాలు తదితర కేసుల వివరాలను తెలియజేశారు. గత సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 35 హత్యలు కాగా, ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 28 హత్యలు జరగాయని అందులో 20 హత్యలు కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి, చిన్న చిన్న తగాదాలతో జరిగాయని అన్నారు. 28 హత్యల్లో అన్నిటిలోనూ నేరస్తులను గుర్తించి పట్టుకొని అరెస్టు చేశామని తెలిపారు. నేరస్తులకు తొందరలోనే శిక్ష పడే విధంగా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం పగటిపూట 37 దొంగతనాలు, రాత్రిపూట 184 దొంగతనాలు, మామూలు దొంగతనాలు 485 జరిగాయన్నారు. గత సంవత్సరం మొత్తంగా 643 దొంగతనాలు జరిగగా, ఈ సంవత్సరం 706 దొంగతనాలు జరిగాయన్నారు. ఆస్తి సంబంధిత నేరాలలో 65 శాతం కేసులను చేధించి, నేరస్థులను అరెస్టు చేసి 63 శాతం సొత్తును ఇప్పటికే స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేసినట్టు తెలిపారు. నేరస్థులందరిపైన తగిన ఆధారాలతో కోర్టులో చార్జ్ సీటు వేశామని, వారికి శిక్ష పడేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా సంబంధిత నేరాల్లో గత సంవత్సర 351 జరగాయని, ఈ సంవత్సరం 346 నేరాలు మాత్రమే జరిగాయని తెలిపారు. డిఎస్పి కార్యాలయాలలో కౌన్సెలింగ్ నిర్వహించడం, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధు శర్మ

రోడ్డు ప్రమాద కేసులు..

గత సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో 243 మంది మరణించగా, ఈ సంవత్సరం 221 మంది మరణించారని, గాయపడిన వారు గత సంవత్సరం 273 కాగా ఈ సంవత్సరం 275 మందికి గాయాలయ్యాయని తెలిపారు. మొత్తంగా గత సంవత్సరం 516 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరం 496 మాత్రమే కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద మరణాల కేసులలో గత సంవత్సరంతో పోలిస్తే 22 కేసులు తగ్గి, 45 మరణాలు తగ్గాయని వివరించారు. సైబర్ క్రైమ్ నేరాలు గత సంవత్సరం 294 జరగగా, ఈ సంవత్సర 240 జరిగాయని తెలిపారు. ప్రతి నెల మొదటి బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ నేరాలను తగ్గించినట్టు తెలిపారు.

కస్టమ్ మిల్లింగ్ వేగవంతంగా జరిగేలా పకడ్బందీ చర్యలు

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ జరిపి నిర్దిష్ట కొత్త మేరకు ఎఫ్.సి.ఐకు బియ్యం నిల్వలు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీ.ఎం.ఆర్ లక్ష్య సాధనపై సమీక్ష జరిపారు. జిల్లాల వారీగా పెండింగ్ లో ఉన్న మిల్లింగ్ కోటా నిల్వలను ప్రస్తావిస్తూ, ఇప్పటికే ఈ నెల 31 నాటితో ఎఫ్.సి.ఐ కి బియ్యం నిల్వలు చేరవేయాల్సిన గడువు పూర్తవుతోందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా మిల్లింగ్‌ను పూర్తి చేయించి బియ్యం నిల్వలు భారత ఆహార సంస్థకు చేరవేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, క్షేత్రస్థాయిలో గట్టిగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉప్పుడు బియ్యం నిల్వలు కోటాకు అనుగుణంగా అందించేలా చొరవ చూపాలన్నారు. ప్రతి రైస్ మిల్లులోనూ పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా మిల్లింగ్ జరిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కోటాకు అనుగుణంగా మిల్లింగ్ చేసిన బియ్యం నిల్వలు భారత ఆహార సంస్థ గోడౌన్లకు చేరేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని హితవు పలికారు. అదేవిధంగా పీ.డీ.ఎస్ బియ్యం రీసైక్లింగ్ దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలని, అక్రమార్కులను గుర్తించి కఠినంగా వ్యవహరించాలని సూచించారు.



కస్టమ్ మిల్లింగ్ అంశంపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, జిల్లాలోని రైస్ మిల్లర్లకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిస్తూ సీ.ఎం.ఆర్ మిల్లింగ్ వేగవంతం చేశామని మంత్రి దృష్టికి తెచ్చారు. మిల్లింగ్ పూర్తయిన వెంటనే బియ్యం నిల్వలను ఎఫ్.సీ.ఐ గిడ్డంగులకు చేరవేస్తున్నామని అన్నారు. నెల రోజుల్లో సీ.ఎం.ఆర్ మిల్లింగ్ వంద శాతం పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ లో కేటాయించిన సీ.ఎం.ఆర్ ధాన్యం మిల్లింగ్ ను పూర్తి చేసిన రైస్ మిల్లులకే రబీలో ధాన్యం కేటాయిస్తామని రైస్ మిల్లర్లకు స్పష్టంగా చెప్పడం జరిగిందని అన్నారు. సంబంధిత అధికారులు రైస్ మిల్లులను సందర్శించి కేటాయించిన ధాన్యం నిల్వలు ఎంత, వాటిలో ఎంత ధాన్యం మిల్లింగ్ జరిపారు, ఇంకనూ మిగిలిన ధాన్యం అందుబాటులో ఉందా లేదా అన్నది స్టాక్ రిజిస్టర్ ఆధారంగా క్షేత్ర స్థాయిలో ఒక్కో రైస్ మిల్ వారీగా పరిశీలన జరుపుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.